ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 23 | సంచిక : 7 | మార్చి 2018

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 16

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రు॥ 150/-
విడి ప్రతి : రు॥ 12/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

30-10-1983
జిన్నూరు

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 30-10-1983, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఒక జ్ఞాని సన్నిధిలో పరమశాంతి లభిస్తుంది. మీ అంతట మీరు దూది కొనుక్కొని, గుడ్డని నేసుకొని, దానిని కుట్టించి కట్టుకోవటం చాలా కష్టం. కుట్టిన గుడ్డ జ్ఞాని తన చేతితోటి ఇస్తాడు. తయారైన గుడ్డ మీ చేతికి ఇస్తే కట్టుకోవటం ఎంత తేలికో, ఒక జ్ఞాని సన్నిధిలో మీరు చేసే సాధనలు కూడా అంతే తేలిక. గురువు అన్నా, కృష్ణుడు అన్నా దేహం కాదు, ఆత్మ. వాళ్ళు నిరంతరమూ ఆత్మదృష్టిలో ఉంటారు కాబట్టి వాళ్ళ సన్నిధిలో మనకు ఆత్మ గుర్తుకు వస్తుంది. మీకు ఎన్ని సమస్యలు ఉన్నా సరే ఆ సమస్యలు అన్నీ కూడా జారిపోతాయి. వాటిని మీరు పట్టుకుందాము అనుకున్నా సరే జారిపోతాయి. నిద్రపోయేముందు మీ చేతిలో ఏదైనా వస్తువు ఉంది అనుకోండి, నిద్రలోకి వెళ్ళేముందు చేతిలో ఉన్నవి జారిపోతాయి. వాటిని మీరు ఏమీ విడిచిపెట్టలేదు, కానీ మీకు నిద్ర వచ్చేసరికి వాటంతట అవే జారిపోతాయి. మీ దేహానికి మరణం రాకముందే మీకు మరణం లేని స్థితి ఎవడు కలుగజేస్తాడో వాడే గురువు. మీ ప్రయత్నాలతో నిమిత్తం లేకుండా తాను ఉన్న స్థితిలోకి మిమ్మల్ని కూడా చేర్చేవాడే గురువు.

ఆకలి వేస్తే మనం అన్నం కోసం చూస్తాము. ఆకలి అనేది ఒక రకమైన బాధ. అలా ఇంద్రియాలకి సంబంధించిన కోరికలు వచ్చినప్పుడు విషయాలకి సంబంధించిన బాధ కలుగుతుంది. మీకు

విపరీతమైన ఆకలి కలిగినప్పుడు అన్నం కోసం మీ మనస్సు ఎలా ఎదురు చూస్తుందో అలా మీలో ఎవరైతే భగవంతుడి కోసం ఎదురు చూస్తున్నారో వారిని భగవంతుడు వరించి ఆయన దగ్గరకి తీసుకుంటాడు. మీరేమీ కష్టపడనక్కరలేదు, శ్రమ పడనక్కరలేదు. మీరు ఆకలిగా ఉన్నప్పుడు మీ మనస్సు అన్నం కోసం ఎలా ఎదురు చూస్తుందో అదేవిధంగా మీ మనస్సు భగవంతుడికోసం ఎదురు చూడాలి. అది ఆకలి బాధ, ఇది దేవుడి కోసం పడే బాధ. అలా ఎప్పుడైనా మీలో ఎవరికైనా బాధ కలిగిందా? మీరు ప్రయాణాలు చేసేటప్పుడు ఎప్పుడైనా టైముకి అన్నం దొరకకపోతే బాధపడిఉండవచ్చు. లేకపోతే ఎప్పుడైనా ఒక రోజున ఎవరూ ఇంట్లో లేకపోతే టైముకి అన్నం దొరకకపోవచ్చు. విపరీతంగా ఆకలి పుట్టినప్పుడు అన్నం దొరకకపోతే మనం పడే బాధ ఎటువంటిదో అటువంటి బాధ మీలో ఎవరికైనా ఈశ్వరుడికోసం ఎప్పుడైనా ఒక్క సెకను అయినా కలిగిందా? మీరెవరూ ఈశ్వరుడికి ద్రోహం చెయ్యలేరు. ఈశ్వరుడికి ద్రోహం చెయ్యటం అంటే మిమ్మల్ని మీరు ద్రోహం చేసుకోవటం. ఆకలి పుట్టినప్పుడు అన్నం కోసం మీ మనస్సు ఎలా ఎదురు చూస్తుందో అలా మీ జీవితంలో ఎప్పుడైనా ఒక్క సెకను అయినా మీ మనస్సు ఈశ్వరుడి కోసం తపించిందా? ఒక్కసారి జీవితంలో వెనక్కి తిరిగి చూసుకోండి. మీలో నలభై సంవత్సరాలు వచ్చిన వాళ్ళు ఉన్నారు, అరవై సంవత్సరాలు, డభ్భై సంవత్సరాలు వచ్చిన వాళ్ళూ ఉన్నారు. రోజులు వేగంగా జారివెళ్ళిపోతున్నాయి. దైవీసంపదకి ఉండవలసిన గుణాలు మనలో ఒక్క మంచిగుణం కనీసం ఒక్క గొప్పగుణం ఏదైనా ఉందా?

సమర్థ రామదాసు ఛత్రపతి శివాజీకి గురువు. ఆయన రోజూ భిక్ష చేసుకునేవాడు. ఒకరోజున ఒక అమ్మగారి ఇంటికి భిక్షకి వెళ్ళాడు. సరిగ్గా సమర్థ రామదాసు భిక్షకి వెళ్ళేసరికి ఆ అమ్మగారు ఆవుపేడతో ఇల్లు అలుకుకుంటున్నారు. అమ్మా కొంచెం భిక్ష పెట్టు అన్నాడు సమర్థ రామదాసు. ఆ ఘడియలో ఆవిడ ఏమి చిరాకులో ఉందో, అన్నం పెట్టలేదు సరికదా ఆవుపేడతో అలుకుతున్న చేతిలో ఉన్న పిడచ గుడ్డ ఆయన ముఖాన వేసి కొట్టింది. ఇక ఆ రోజున రామదాసు ఎవరి ఇంటికి భిక్షకి వెళ్ళలేదు. మహాప్రసాదంగా ఆ గుడ్డని తీసుకొని కుటీరానికి వెళ్ళిపోయాడు. ఆ గుడ్డని శుభ్రంగా ఎక్కడా పేడ లేకుండా కడిగేసి ఎండలో ఆరబెట్టి, అందులో ఒక్కొక్క దారం తీసాడు. వాటితో దీపారాధనకి వాడే వత్తులు చేసాడు. శ్రీరామచంద్రమూర్తి ఫొటో దగ్గర ప్రమిదలో నూనె పోసి ఆ దారాలతో చేసిన వత్తులు

అందులో వేసి దీపారాధన చేసి ఇలా ప్రార్థించాడు "రామచంద్ర ప్రభూ! శ్రీ రామచంద్ర మూర్తీ, నువ్వు ఎంతోమంది పాపులను నిష్పాపులుగా చేసావు. శ్రీరామా శ్రీరామా అంటే చాలు వాళ్ళ పాపాలు కడిగేసావు. వాళ్ళ పాపాలు పోయాయి. రామచంద్రుడుని స్మరిస్తే ఈ భారతదేశంలోనే కాదు ఈ సృష్టిలో ఎంతోమంది పాపులు నిష్పాపులు అయ్యారు. రామా, నన్ను పిడచగుడ్డ పెట్టి అమ్మ కొట్టింది. ఆ దారాలతో వత్తులు తయారుచేసి నీకు దీపారాధన చేస్తున్నాను. ఈ పిడచగుడ్డ నాది కాదు, ఈ దారాలు నావి కావు, ఇవి అమ్మగారివి. అమ్మ ఎంత బాధలో ఉండి, మనస్సు ఎంత ఇరుకులో పడిపోయి, ఇంటిలో ఎన్ని బాధలు పడి ఈ పిడచగుడ్డ పెట్టి నన్ను కొట్టిందో. నన్ను పిడిచగుడ్డ పెట్టి కొట్టిందని నేను బాధ పడటంలేదు. అమ్మగారి మనస్సు ఎన్ని కష్టాలలో ఉందో, కుటుంబంలో ఎన్ని బాధలు బరువులు మోస్తోందో, లోపల మనస్సులో ఎంత కష్టం లేకపోతే ఆ అమ్మ నన్ను పిడచగుడ్డ పెట్టి కొడుతుంది. రామచంద్రమూర్తీ, ఆ అమ్మ కష్టాలని తీసెయ్యి, అమ్మ మనస్సులో ఉన్న దోషాలని తీసెయ్యి. అమ్మకి క్షమ, సహనం కలుగచెయ్యి. అమ్మ మనస్సుకి మామూలు పరిస్థితి తీసుకురా రామచంద్రమూర్తి. నేను ఊరికే దీపం వెలిగిస్తున్నాను కానీ, ఈ దారాలు ఆవిడవే, ఈ వత్తులు ఆవిడవే. అందుచేత అమ్మ ఏ కష్టంలో ఉందో ఆ కష్టాన్ని తీసెయ్యి రామచంద్రమూర్తీ. నువ్వు ఎంతోమంది భక్తులని రక్షించావు. ఈ అమ్మని రక్షించలేవా. ఎంత క్షోభ పడకపోతే, ఎంత దుఃఖంలో లేకపోతే పిడిచగుడ్డ నాముఖం మీద వేస్తుంది" అని ఆవిడ బాధ చూస్తున్నాడు రామదాసు. ఆ బాధని తొలగించమని శ్రీరామచంద్రమూర్తిని ప్రార్థిస్తున్నాడు. అది మహాత్ముడి యొక్క లక్షణం. ఇటువంటి ఒక్క గుణం మనలో ఎవరికైనా ఉందా? ఆయనను కొట్టినప్పుడు ఆ అమ్మ మనస్సులో ఉన్న వేదనని చూస్తున్నాడు సమర్థ రామదాసు. అయ్యో నన్ను కొట్టింది అని కాదు, ఎంత బాధలలో ఉందో అమ్మ, ఎంత భారం మోస్తోందో, ఆ కుటుంబం బరువు మొయ్యలేకపోతోంది, ఎంత చిరాకులో ఉందో, లేకపోతే నన్ను ఎందుకు గుడ్డతో కొడుతుంది. ఆ కష్టాన్ని తీయవా రామచంద్ర ప్రభూ, నా మాటగా అయినా తీయవా అని రామచంద్రమూర్తిని ప్రార్థించాడు.

ఈశ్వరుడి యొక్క ఆజ్ఞ, ఈశ్వరుడి యొక్క అనుగ్రహం వలన మీరు ఇక్కడికి వస్తున్నారు. మీ తెలివితేటల వల్ల, మీ సాధన వల్ల, మీరు ఈ గేటు దగ్గరకి వస్తున్నారని నేను అనుకోవటం లేదు. మీ తెలివితేటలలే కారణం అయితే మీకంటే ఎక్కువ తెలివైన వాళ్ళు

అందరూ ఇక్కడికి రావటంలేదు కదా! మీ ధనమే కారణం అయితే మీకంటే పెద్ద ధనవంతుడు ఇక్కడికి రావటం లేదు కదా! ఈశ్వరుడు సంకల్పించాడు, మీరు వస్తున్నారు. అది మీ పూర్వ పుణ్యం. మనం మతాన్ని కల్పించుకున్నాము, మతానికి భయపడుతున్నాము. పెళ్ళి మనమే చేసుకున్నాము. సంసారాన్ని మనమే సృష్టించుకున్నాము. మనము సృష్టించిన సంసారానికే మనము భయపడిపోతున్నాము. రాజులని, బ్రాహ్మణులని ఈ కులాలు మనమే సృష్టించుకున్నాము, మళ్ళీ ఈ కులాలకి భయపడిపోతున్నాము. ప్రభుత్వానికి ఓట్లు మనమే వేసాము, మళ్ళీ ఆ ప్రభుత్వాన్ని చూసి మనకి భయం! ఇవన్నీ మనము కల్పించుకున్నవే. మన మనస్సుతో కల్పించుకొని, ఆ విషయాలలో చిక్కుకొనిపోతున్నాము. మనం ఏ విషయాలైతే మనస్సుతోటి కల్పించుకొంటున్నామో, మళ్ళీ ఆ కల్పించుకొన్న విషయాలలోనే, జైలులో దొంగవాడిని పెట్టినట్లు, మన మనస్సుని తీసుకెళ్ళి అందులో పెడుతున్నాము. మీరు భారతం చదవండి, రామాయణం చదవండి, భాగవతం చదవండి, ఉపనిషత్తులు చదవండి - ఏది చదివినా ఏది చదవకపోయినా ఈ దేహం నేను అనే భావనలోంచి బయటకు రావాలి. మాయకి మూలం ఈ 'నేను'. ఈ నేనే అన్నీ సృష్టించింది. మతాన్ని సృష్టించు కున్నాము మతానికి బానిసలము అయ్యాము. మనం ఏదైతే సృష్టించుకున్నామో దానికి పాలేరుతనం చేస్తున్నాము. మన మనస్సుకి, మన శరీరానికి, మన ఆలోచనలకి అందనిది, ఈ సృష్టికి అతీతముగా ఉన్నది ఒక్క ఆత్మ మాత్రమే. అది సృష్టించబడినది కాదు, అందుకే అది మనస్సుకి అందదు. మన మనస్సుని దానికి స్వాధీనం చేయగలిగితే వాడికి దేవుడి అనుగ్రహం అందుతుంది.

ఒక్క ఆత్మ తప్పించి ఈ లోకంలో గొడవలన్నీ మనం సృష్టించుకున్నవే - గవర్నమెంటు, మతాలు, దేవుళ్ళతో సహా అన్నీ మనం కల్పించుకొన్నవే. చెట్టు మొదలు నరికేస్తే ఆకులు క్రింద పడిపోతాయి, రొబ్బలు కాయలు కొమ్మలు అన్నీ పడిపోతాయి. ఈ దేహం మాత్రమే నేను అనే భావం ఉన్నంతకాలం సంసారం కూడనే వస్తుంది, జన్మలు కూడానే వస్తాయి. ఈ కనిపిస్తున్న దేహం నీ ఆత్మది కాదు, నీ అహంకారానిదే. నీ అహంకారం దానిని తయారు చేసి పెట్టింది. కీర్తి ఓడిపోతుంది, చదువు ఓడిపోతుంది, అన్నీ ఓడిపోతాయి, ఒక్క ప్రేమకే ఓటమి లేదు. విద్యాదానం కంటే జ్ఞానదానం గొప్పది. జ్ఞానాన్ని ప్రసాదించే వాడే సద్గురువు. మీరు పూజలు చెయ్యండి, జపాలు చెయ్యండి, ధ్యానాలు చెయ్యండి అని పుస్తకాలనిండా

రాసివున్నాయి. గురువులు అందరూ చెపుతున్నారు. మీకు ఇష్టం అయితే మీరు అవన్నీ చెయ్యొచ్చు. కానీ ఆ బరువు కూడా మీమీద పెట్టడం నాకు ఇష్టంలేదు. జపాలు చేసినా, ధ్యానాలు చేసినా, మనస్సు చల్లబడటానికే కదా! మనస్సు చల్లబడటానికి ఇవన్నీ మీరు చేస్తున్నారు. వీటితోటి నిమిత్తం లేకుండా మీ మనస్సు చల్లబడుతూ వుంటే, వీటితోటి పని ఏముంది మీకు? నన్ను చూడగానే మీ మనస్సు ఆత్మవైపు తిరగకపోతే, మీకు శాంతి రాకపోతే నేను పవిత్రుడిని కాదు. మీలో ఎవరినైనా హృదయపూర్వకంగా నేను స్మరిస్తే, నేను స్మరించిన వెంటనే మీకు శాంతి కనుక రాకపోతే నేను పవిత్రుడినే కాదు! దేహం లేని స్థితికి, లోకం లేని స్థితికి, అహంకారం లేని స్థితికి మీరు ప్రయాణం ప్రారంభిస్తున్నారు. మీకు ప్రేమ లేకపోతే, మీకు ప్రేమ కలుగజేసే బాధ్యత కూడా నాదే! దానికి కూడా మీరు కష్టపడనక్కరలేదు. ఈశ్వరుడిని మీరు ప్రేమించాలి కానీ ఆ ప్రేమ మీలో లేనప్పడు ఆయనను ఎలా ప్రేమించగలరు? అందుచేత ఆ ప్రేమను మీలో కలుగజేసే బాధ్యత కూడా నాదే.

ఇంటిలో మనిషి ఉన్నప్పడు కిటికీ తలుపులు తెరిచి ఉన్నాయా? మూసి ఉన్నాయా? అనే ప్రశ్న వస్తుంది. ఆ గదిలో నుంచి చూసేవాడే లేనప్పడు కిటికీ తలుపులు మూసి ఉంటే ఏమిటి? తీసి ఉంటే ఏమిటి? కళ్ళ ద్వారా చూసేది ఎవరు? అహంకారం. ఆ అహంకారం లేనప్పడు కళ్ళు మూస్తే ఏముంది? తెరిస్తే ఏముంది? ధ్యానం చేసుకోవాలి, జపం చేసుకోవాలని అని పెద్దలు చెప్పారు. అలా నాకూ ఉంటుంది, అలా నేనూ మొదలుపెడుతున్నాను, కానీ సూర్యుడి ఎదురుగా దీపం వెలిగించినట్టు ఉంటుంది నాకు.

అరుణాచలం కొండ మీద జటాస్వామి అని ఒక స్వామి ఉండేవారు, భగవాన్ కంటే ముందు నుండి ఆ కొండ మీద ఉన్నారు. ఆ జటాస్వామి నైస్తిక బ్రహ్మచారి, వివాహం చేసుకోలేదు. గొప్ప ఆహార నియమం కలవాడు. మితభాషి. సంస్కృతం అవీ బాగా చదువుకున్నాడు, ఆయన దగ్గర అనేక గ్రంథాలు ఉన్నాయి. ఆశ్చర్యం మాయ ఎలా వస్తుందో చూడండి; రమణస్వామి కొండమీద కూర్చున్నాక జటాస్వామిని చూడటానికి వచ్చే వాళ్ళకంటే రమణస్వామిని చూడటానికి వచ్చేవాళ్ళు ఎక్కువగా ఉండేవారు. జటాస్వామి భక్తుడు అంత మంచివాడికి కూడా అసూయ వచ్చింది. తనని చూడటానికంటే రమణస్వామిని చూడటానికి జనం ఎక్కువ వచ్చేస్తున్నారని ఆయనకు ఒక విధమైన అసూయ కలిగింది. రమణస్వామిని చూడటానికి వస్తే ఈయనకి నష్టం ఏముంది? అలా విడదీసుకొని

ఎనాలిసెస్ చేసుకొంటే ఏమీ లేదు. రమణస్వామి వైపు జనం ఆకర్షింపబడటానికి అక్కడి రమణస్వామి కారణమా? అది ఈశ్వరుడి ఏర్పాటు. అక్కడ రమణస్వామి కూడా కారణం కాదు. రమణస్వామి దేహం కూడా మన దేహం లాంటిదే. రమణస్వామి ద్వారా తరించవలసిన జనాన్ని అక్కడికి తీసుకెళ్తున్నాడు ఈశ్వరుడు అంతే. అసలు మీరు నాపట్ల గౌరవభావం తోటి ఎందుకు ఉన్నారు? అది మీ శరీరం, ఇది నా శరీరం అని కాదు, ఈశ్వర సంకల్పం అది. జటాస్వామి దగ్గరకి తక్కువ జనం వస్తున్నారు, రమణస్వామి దగ్గరకి జనం ఎక్కువ వెళ్తున్నారు. అంటే ఎక్కువ వెళ్ళటానికి ఎవరు కారణం? వీళ్ళు కాదు, వీళ్ళ బొమ్మలు ఈ శరీరాలు నీడలు! అది ఈశ్వర నిర్ణయం. ఈశ్వరుడు సంకల్పించకుండా మీరు సంకల్పించగలరా? అసలు మీకు తలంపు వస్తోంది అంటే ఎక్కడి నుంచి వస్తోంది? ఇప్పుడు మీకు వాలమర్రు నుంచి జిన్నూరు వెళ్ళాలని సంకల్పం వచ్చిందనుకోండి? ఆ తలంపు అసలు మీకు ఎక్కడినుంచి వస్తోంది? ఎవరు కలుగజేసారు ఆ తలంపు? తలంపు లేకుండానే మీ శరీరాలు ఇక్కడికి వచ్చేసాయా? ఆ తలంపు పుట్టిన తరువాత కదా మీరు జిన్నూరు వచ్చారు. ఎక్కడ పుట్టింది ఆ తలంపు? అనేక గ్రామాలు ఉండగా జిన్నూరు రావాలని తలంపు ఎందుకు పుట్టింది? అనేకమంది సాధువులు ఉండగా ఇక్కడికే రావాలని తలంపు ఎందుకు పుట్టింది? అది ఈశ్వర నిర్ణయం. మంచి హృదయం ఉన్న జటాస్వామికి కూడా అసూయ అలా పెరిగిపోయింది. మాయని జయించాలి. అప్పుడు తరించాము అనుకోవాలి. గట్టెక్కిన తరువాత గట్టెక్కాము అనుకోవాలి కానీ, ఈ లోపల మనము తరించాము అని అనుకోవటానికి వీలులేదు. మన పెద్దలు అంటారు రోజులు బాగా వెళ్ళిపోవాలి అప్పుడు వెళ్ళిపోయాయి అనుకోవాలి అని. ఈ లోపల శరీరంలో ఎన్ని బాధలు ఉన్నాయో? ఈ లోపల మనము గర్వపడకూడదు. ప్రాణం ఈ శరీరంలోంచి తప్పకోవాలి. అతని రోజులు సుఖంగా వెళ్ళాయి అని అప్పుడు చెప్పాలి కానీ, ఈలోపులో రోజులు ఎలా వెళతాయో చెప్పలేము. జటాస్వామి అంతటి మంచివాడికి చివరికి ఏమైందంటే రమణస్వామిని చంపెయ్యాలి అని బుద్ధి పుట్టింది. ఇక్కడే మీరు గ్రహించండి. జటాస్వామి చాలా మంచివాడు, వయస్సులో పెద్దవాడిని, రమణస్వామికంటే చదువుకున్నాను, నా దగ్గరకి జనం రారేమిటి? అంతకు ముందు వచ్చే జనం ఇప్పుడు ఇద్దరు ముగ్గురే వచ్చి రమణస్వామి దగ్గరికి ఇరవైమంది వెళ్ళిపోతున్నారు ఏమిటి? అనుకున్నాడు - అదే మాయ. అంతే

రమణస్వామి కొండ పక్కన కూర్చుని ఉండగా పెద్ద బండని క్రిందకి గెంటివేద్దామని చూసాడు, ఆ బండ ఆయన మీద పడితే చచ్చిపోతాడని. మిగతావి అన్నీ మంచి గుణాలు ఉన్నాయి, కానీ చూడండి అసూయ ఏ స్థాయిలో ఉందో? రమణస్వామి వల్ల ఈయనకేమైనా ఆస్తి నష్టం వచ్చిందా? ఇంతా చేస్తే ఈ ఒక్క అసూయ అనే గుణం మనిషిని ఎంతదూరం తీసుకుపోతోందో చూడండి. పోనీ ఇదేమైనా ఆకలి బాధా ఎదుటి మనిషిని తినెయ్యటానికి? జటాస్వామి కొండమీదికి వెళ్ళి ఆ రాయి గెంటబోతున్నాడు, రమణస్వామి నెమ్మదిగా వెళ్ళి చెయ్యి పట్టుకున్నాడు, పకాలున నవ్వాడు జటాస్వామి. వేళాకోళం కోసం చేసాను అన్నాడట. వేళాకోళం కోసం అంత పెద్దరాయిని మనిషి మీదికి గెంటుతారా అన్నాడు రమణస్వామి. అంటే నువ్వు చేస్తున్న పని నేను చూసాను సుమా అని చెప్పటం కోసం. ఇక్కడ మీరు గ్రహించాలి, రాయి నా మీద ఎందుకు గెంటుతున్నావు అని అడగలేదు రమణస్వామి. తరువాత రమణస్వామి జటాస్వామికి లింగరూపంలో కనిపించి జాగ్రత్త అని ఒక హెచ్చరిక చేసాడు. అప్పటి నుంచి ఆ పాడుపనులు మానేసాడు జటాస్వామి. అంటే ఒక్క దుర్గుణం మనిషిని ఎంతదూరం తీసుకుపోతుందో చూడండి!

మీరు మంచివాళ్ళని మీరు అనుకోవచ్చు. కానీ కనీసం మీ తలంపు మీ చేతిలో ఉండదు. మనకి ఏవో తలంపులు వస్తూ ఉంటాయి. మీకు కష్టం కలిగించే తలంపులు కూడా మీకు వస్తూ ఉంటాయి. ఆ తలంపులు వద్దు అని మీరు అనుకుంటారు, కానీ ఆ తలంపులు మీకు రావటం మానవు. మీ తలంపే మీ స్వాధీనంలో లేనప్పుడు ఇంక మీరు ఎలాగ మారేది? ఎదుటి మనిషులని ఎవరినీ మీరు స్వాధీనపరుచు కోనక్కరలేదు, మీ ఇంటిలో మనుషులని కూడా మీరు స్వాధీనపరుచుకోనక్కరలేదు. అసలు మీ తలంపు మీ స్వాధీనంలో ఉందా? ఇంక ఏంటి మీరు చేసేది? ఇక్కడ కూర్చున్న వాళ్ళలో ఎవరికైనా కోటి రూపాయలు ఉంటే, మీ దగ్గర ఉన్న కోటి రూపాయలు ఖర్చు పెట్టి మీకు వచ్చే తలంపులలో ఒక్క తలంపుని ఆపుచేసుకోండి. రమణమహర్షిలాగే ఇంకా కొంతమంది జ్ఞానులు ఉండవచ్చు, కానీ జ్ఞాని గురువుగా ఉండటం కష్టం. ఈ దేశంలో మీకు ఎక్కువగా రమణస్వామి, రామకృష్ణుడి పేరులే వినబడుతున్నాయి. వీళ్ళిద్దరూ పొందిన స్థితిని భారతదేశంలో ఇంకెవరూ పొందలేదని మీరు అనుకోవద్దు. ఎవరైనా కొంతమంది పొంది ఉండవచ్చు. మనం కాదు అనటానికి వీలు లేదు. కానీ వీళ్ళు జ్ఞానులే కాక గురువులు

కూడా అయ్యారు. మీ మనస్సుని మీ స్వస్థానానికి తీసుకొని వెళ్ళే బాధ్యత కూడా గురువుదే. అలా చెయ్యగలిగిన వాడే గురువు. మీరు మంత్రాలు వస్తే గురువు అనుకుంటున్నారు, ఒక జ్ఞాని హృదయపూర్వకంగా మనని స్మరిస్తే చాలు మన పని పూర్తి అయినట్టే. ప్రపంచాన్నంతా మోస్తున్నాడు ఈశ్వరుడు, మీ ఒక్క సంసారమే మొయ్యలేడేమో అని మీకు అనిపిస్తుంది. అలా అనిపించేది కూడా అహంకారమే. మీ మనస్సు నిగ్రహం విషయంలో, ఆ బాధ్యత కూడా గురువుదే. వాసనలు అంటే ఏమిటి? సంస్కారాలు అంటే ఏమిటి? మన మనస్సుకి వున్న అలవాటులే సంస్కారాలు; మన మనస్సుకి ఉన్న అలవాటులే వాసనలు. ఈ వాసనలు మీ మనస్సుకి ఎలా వచ్చాయి? ఈ దేహంలో మనం ఎటువంటి పనులు చేస్తున్నామో, పూర్వ జన్మలలో ఏదో దేహంలో ఉండి మనం చేసిన పనులే వాసనలుగా అలా కూడా వచ్చాయి. ఈ వాసనలు పోగొట్టుకోవటం కష్టం అని మీకు అనిపించవచ్చు. సింహం ముందు మేకకి ఎంత బలం ఉంటుందో, గురువు అనుగ్రహం ముందు ఈ వాసనలు కూడా అంతే. సింహం మేకతోటి పోరాడేటప్పడు చాలా కష్టం అయిపోతోంది ఈ మేకని జయించటం అని సింహం అనుకుంటుందా? లేదు. మీకున్న వాసనలు, మీకున్న సంస్కారాలు గురువు అనుగ్రహం ముందు అంతే.

గుహనమశ్శివాయ జ్ఞానే కానీ ఆయనకి శిష్యులు తక్కువ. ఆయన గొప్ప జ్ఞాని, ఆయనకు గొప్ప సిద్ధులు కూడా ఉన్నాయి. ఒక గొల్లవాడు తన మేకలలో ఒక సూడి మేక చచ్చిపోయిందని గుహనమశ్శివాయ దగ్గరకి తీసుకెళ్ళి ఏడ్చాడు. నాకు ఈ మేక ఆధారం, దీనితో నాలుగు రూపాయలు సంపాదించుకొంటున్నాను. ఈనుతుందని, పాలు ఇస్తుందని, దాని పిల్ల వల్ల నాకు డబ్బు వస్తుందని అనుకున్నాను అని ఏడ్చాడు. ఆ చచ్చిపోయిన మేకని ఇక్కడ కట్టి వెళ్ళిపో అన్నాడు గుహనమశ్శివాయ. మరుసటిరోజు ఆ గొల్లవాడు వచ్చేసరికి ఆ మేక బ్రతికి ఉంది, పిల్లలని పెట్టింది. వాడు వెళ్ళి అందరితోటి చెప్పాడు చచ్చిపోయిన నా మేకని గుహనమశ్శివాయ బ్రతికించాడని. తిరువణ్ణామలైలో కొంటె పిల్లలు కొందరు కలసి ఇదంతా నిజంకాదు అనుకొని, బ్రతికున్న ఒక మనిషిని చచ్చిపోయినట్టు పడుకోబెట్టి, శవాన్ని తీసుకెళ్ళినట్టు వాడిని గుహనమశ్శివాయ దగ్గరకి తీసుకువెళ్ళారు. స్వామీ వీడు చనిపోయాడు మీరు బ్రతికించాలి అన్నారు. పోయాడు అని మీరే చెపుతున్నారు కదా! పోయినవాడు పోయినట్టే అన్నాడు. జ్ఞానులతో త్రాచుపాము దగ్గర ఉన్నంత జాగ్రత్తగా

ఉండాలి. జ్ఞాని యొక్క అనుగ్రహం ఎంత తీవ్రంగా ఉంటుందో ఆగ్రహం వచ్చినా అలాగే ఉంటుంది. పోయాడు అని మీరు చెపుతున్నారు పోయాడు కదా అన్నారు. వాడు బ్రతికే ఉన్నాడు, కానీ పోయాడు అని ఎప్పడైతే ఈయన అన్నాడో వాడు నిజంగా చనిపోయాడు. పేచీ పెట్టుకుందాము అంటే వెళ్ళిన వాళ్ళు అందరూ చచ్చిపోతామేమో అని భయం వేసి ఆ శవాన్ని తీసుకొని తిరిగి ఇంటికి వచ్చారు. అప్పడు గుహనమశ్శివాయ ఈ తిరువణ్ణామలై పట్టణంలో భక్తులు ఎక్కువమంది లేకపోవచ్చు కానీ భక్తులని కూడా పరీక్షించటానికి వీళ్ళు సిద్ధం అవుతున్నారు అని తిరువణ్ణామలై పట్టణం నాశనం అవుగాక అని శాపం బెట్టబోయాడు. ఈ మాటలు ఎందుకు చెపుతున్నానంటే ఈశ్వరుడు హృదయంలో ఉంటాడు, మనకు తలంపు పుట్టకముందే వాడికి తెలుస్తూ ఉంటుంది. మనకి తలంపు ఇంకో సెకనులో పుడుతుంది అనగానే మనకు ఏ తలంపు వస్తోందో వాడికి తెలుస్తుంది. ఈ తిరువణ్ణామలై పట్టణం నశించుగాక అని శాపం పెట్టబోతున్నాడు గుహనమశ్శివాయ. ఇంకా ఆ మాట రాలేదు, మాట రాబోతున్నది అప్పడు అరుణాచలేశ్వరుడు "నమశ్శివాయా ఈ క్షేత్రంలో నేను ఉన్నాను కదా!" అని పలికాడు. క్షేత్రమే నాశనం అవ్వాలి అని మాట రాబోతున్నది గుహనమశ్శివాయకి, అప్పడు అరుణాచలేశ్వరుడు మానవరూపం ధరించి నమశ్శివాయా నేనంటూ ఒకడిని ఇక్కడ ఉన్నాను కదా అంటే అప్పడు చల్లబడ్డాడు. అటువంటి ఉద్రేకానికి కానీ, అటువంటి ఆవేశానికి కానీ ఎప్పడూ రమణస్వామి గురికాలేదు. ఏ ప్రకృతి విషయాలనైతే మీరిప్పడు ఎక్కువ ఆలోచిస్తున్నారో, మళ్ళీ భవిష్యత్తు జన్మలలో చాలా కష్టపడి ఆ విషయాలని మీ చేతులతోటి వెనక్కి లాక్కోవాలన్న సంగతి మీరు మర్చిపోవద్దు. మీ మనస్సుని ప్రకృతిలోకి ఎంత తీవ్రంగా పంపిస్తే మళ్ళీ అంతే కృషి చేసి వెనక్కి లాక్కోవాలి. పుల్ల ఎండకముందు అగ్గిపుల్ల వేస్తే, అగ్గిపెట్టె ఖర్చు అయిపోయినా పుల్ల వెలగదు. పుల్ల తడిగా ఉన్నప్పడు అగ్గిపుల్లలు ఎన్ని వేసినా అగ్గిపెట్టె ఖర్చు అయిపోతుంది కానీ ఆ కర్ర వెలగదు. రమణస్వామి ఇప్పడు మీకు చేసే పని ఏమిటంటే, మీ మనస్సుని బాగా ఎండబెడుతున్నాడు. ఎండబెట్టిన తరువాత పుల్ల వెలిగే టైములోనే ఆయన అగ్గిపుల్ల వేస్తాడు. రమణస్వామి ఏమీ మనల్ని చూడటం లేదని మీరు అనుకోవచ్చును, మిమ్మల్ని చూస్తూనే ఉన్నాడు. కానీ ఇప్పడు ఆయన అగ్గిపుల్ల వేసే పనిలో లేడు, మీ మనస్సులను ఎండబెడుతున్నాడు. ఎండటం పూర్తి అయిన తరువాత అప్పడు అగ్గిపుల్ల వేస్తాడు. ఇంక మీ కష్టంతోటి నిమిత్తం లేకుండా మీ

పని పూర్తి కాబోతోంది. నేను మాటలు మాట్లాడుతూవుంటే మీకు దూరం అయిపోతున్నానేమో, మౌనంగా ఉంటే బహు దగ్గరగా బహు సన్నిహితంగా ఉన్నట్టు ఉంటుంది. మౌనంగా ఉంటే ఎడబాటు లేదు. మౌనానికి భాషతో పని లేదు. భగవాన్‌తో ఒకడు నన్ను ఫలానా వాడు రోజూ తిడుతున్నాడని చెప్పాడు. అప్పుడు భగవాన్ చెప్పారు నీ శరీరం నీకు శత్రువు. వాడు నీ శత్రువుని తిడుతున్నాడు, నీకు బాగా సహాయం చేస్తున్నాడు. అందుచేత వాడితో కలసి నువ్వు కూడా నీ శరీరాన్ని తిట్టుకో అన్నారు.

భగవాన్ ఎదురుగా కూర్చుని ఒక ప్లీడరు ఆయనని లోపల తిట్టుకుంటున్నారు, పైకి తిడితే మర్యాదగా ఉండదని లోపల తిట్టుకొంటున్నాడు. ఇంతా చేస్తే ఆయనకు రెండు రోజులు ప్రయాణం చెడిపోయింది. ప్రయాణానికి సిద్ధం అయితే ఏదో రకంగా ప్రయాణం ఆగిపోతోంది. పైకి మౌనంగా కూర్చున్నాడు, నా ప్రయాణం చెడగొట్టేస్తున్నాడు దుర్మార్గుడు, ఏమీ ఎరగనట్టు అలా కూర్చున్నాడు, నా ప్రయాణం రోజూ చెడిపోతోంది అని లోపల భగవాన్ని తిట్టుకొంటున్నాడు ఆ ప్లీడరు. అప్పుడు భగవాన్ అన్నారట తిడితే భగవంతుడిని తిట్టటం మంచిది, ఎందుచేతంటే చెడ్డవాళ్ళని తిడితే తిరిగి కొడతారు, మంచివాళ్ళని తిట్టకూడదు, మంచివాళ్ళు తిరిగి కొట్టరు కానీ వాళ్ళకి కూడా మనస్సు ఉంటుంది, మనస్సులో బాధ పడతారు, అప్పుడు వాళ్ళకున్న పాపాలన్నీ వచ్చి మీకు అంటుకుంటాయి. అందుచేత చెడ్డ వాళ్ళని తిట్టినా ప్రమాదమే, మంచివాళ్ళని తిట్టినా ప్రమాదమే. అందుచేత భగవంతుడినే తిట్టు మంచిది, భగవంతుడికి ఇదేమీ లేదు. తిట్టుకుంటే భగవంతుడినే తిట్టుకో.

మనకి అన్నిటికంటే మన దేహం అంటే చాలా ఇష్టం. మీకు కూడా మీ పిల్లల కంటే, మీ భర్త కంటే, మీ అమ్మకంటే, మీ దేహం అంటేనే మీకు ఎక్కువ ఇష్టం. మీరు ఇంటికి వెళ్ళిన తరువాత ప్రశాంతంగా ఆలోచించుకోండి. మీరు అనుకొంటున్నారు నా భర్త నాకు ఎక్కువ ఇష్టం, నా పిల్లలు నాకు ఎక్కువ ఇష్టం, నా మనవలు నాకు ఎక్కువ ఇష్టం అని. అలా మీకు అనిపించినా అది అబద్ధం. మీ దేహమంటే మీకు ఎక్కువ ఇష్టం, మీ దేహాన్ని బట్టే మీ అమ్మ మీకు ఇష్టం, మీ దేహాన్ని బట్టే మీ భర్త మీకు ఇష్టం, మీ దేహాన్ని బట్టే మీ పిల్లలు మీకు ఇష్టం. మీరు కోరే కోరికలన్నీ దేహం కోసమే కోరతారు. మీ కోసమే కోరికలు కోరుకుంటారు. మీ అమ్మకోసం, మీ భర్తకోసం, మీ పిల్లలకోసం కోరే కోరికలు అన్నిటికీ కూడా మీ దేహమే కేంద్రం. ఇదంతా ప్రేమకాదు, ఇదంతా మోహం. అందరినీ

మోహించి అది ప్రేమ అనుకుంటున్నారు. ప్రేమకి దీర్ఘశాంతి ఉంటుంది, మోహానికి దీర్ఘ శాంతి ఉండదు; ప్రేమకి తెలివి ఉంటుంది, మోహానికి తెలివి ఉండదు; ప్రేమకి వివేకం ఉంటుంది, మోహానికి వివేకం ఉండదు; ప్రేమకి కళ్ళు ఉంటాయి, మోహానికి కళ్ళు ఉండవు. అజ్ఞాని మోహిస్తాడు, జ్ఞాని ప్రేమిస్తాడు. మోహం తిరిగి ఏదో ఒకటి అడుగుతుంది. ఇక్కడ కూర్చున్న మీరందరూ అనుకోవచ్చు మేము భగవంతుడిని ప్రేమిస్తున్నాము, మేము భక్తులము అని. కానీ భగవంతుడే మిమ్మల్ని ప్రేమిస్తున్నాడు. మీ అబ్బాయికి మీరు ఒక రూపాయి ఇస్తే, అందులో పది పైసలు తిరిగి మీకు ఇచ్చి మా అమ్మకి నేను పది పైసలు ఇచ్చాను, పది పైసలు దానం చేసాను, అని మీ అబ్బాయి అనుకోవటం ఎలా ఉంటుందో, భగవంతుడిని నేను ప్రేమిస్తున్నాను అని మీరు అనుకోవటం కూడా అలాగే ఉంటుంది.

మీ అనుగ్రహం కోసం అనేకసార్లు మీ దగ్గరకి వచ్చాను, మీ అనుగ్రహం నా మీద పడటంలేదు, నన్ను ప్రేమించటం లేదు అన్నాడు ఒక భక్తుడు రమణస్వామితో. కొంతమంది బాధని మౌనంగా భరిస్తారు. కొంతమంది మాటలతో వ్యక్తం చేస్తారు ఆ బాధని. వాడు అడిగేసాడు, నేను మీ దగ్గరకి అనేకసార్లు వస్తున్నాను, నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను, మీ అనుగ్రహం మట్టుకు నాకు రావటం లేదు అని. అప్పుడు భగవాన్ అన్నారు పీకలోతు దాగా నీటిలో నువ్వు మునిగి దాహానికి మంచినీళ్ళు దొరకటం లేదని ఏడవటం ఎలా ఉంటుందో నా ప్రేమ నీకు లేదనటం అలాగే ఉంది.

పని చేసుకొంటున్నా, పని చేసుకోకపోయినా, మీరు వ్యవహారంలో ఉన్నా వ్యవహారంలో లేకపోయినా నిరంతరమూ సమాధి స్థితిలో ఉండాలి. ఏదో పది నిమిషాలు ముక్కు మూసుకొని కూర్చోవటం కాదు, మీరు పని చేసుకొంటున్నా సమాధిలో ఉన్నట్టు ఉండాలి. దుఃఖాన్ని మీరు పొందటంకాదు, ఒకవేళ వెదికి పట్టుకుందామన్నా మీకు దుఃఖం కనపడకూడదు. ఒకవేళ సూర్యుడికి ఎప్పుడైనా బుద్ధి పుట్టింది అనుకోండి చీకటి ఎలా ఉంటుందో చూద్దామని, చూడగలడా? ఎక్కడికి వెళ్తే అక్కడే వెలుతురు వచ్చేస్తుంది కదా! ఇంక చీకటిని ఎలా చూడగలడు పాపం. జ్ఞానికి దుఃఖం దూరంగా ఉంటుంది. సూర్యుడికి చీకటి ఎంత దూరంగా ఉంటుందో, జ్ఞానికి దుఃఖం అంత దూరంగా ఉంటుంది. సూర్యుడు చీకటిని చూడలేడు, జ్ఞాని దుఃఖాన్ని చూడలేడు.

ఒకసారి భగవాన్ దగ్గర ఒక రిటైర్డ్ మాష్టారు “రమణ సద్గురు రమణ సద్గురు

రమణ సద్గురు రాయనే” అని పాడుతూ ఉంటే, భగవాన్ కూడా “రమణ సద్గురు రమణ సద్గురు రమణ సద్గురు రాయనే” అంటున్నారట. భగవాన్ మీరు పాడకూడదు, నేను మీ గురించి పాడుతున్నాను, మీరు అలా పాడకూడదు, మీరు మౌనంగా ఉండండి అన్నారు ఆ మాష్టారు. “రమణ సద్గురు అంటే ఈ దేహమా, ఇందులో ఈ కాళ్ళా చేతులా, ఎవరు రమణ సద్గురువు అంటే? ఇంతకాలం మీరు నా దగ్గర నేర్చుకున్నది రమణమహర్షి అంటే ఈ దేహం అనా? ఇంతకాలం మీరు నా దగ్గర నేర్చుకున్నది ఇంత మాత్రమేనా? రమణుడు అంటే ఈ దేహమేనా? రమణుడు అంటే పరమాత్మ, పరబ్రహ్మ స్వరూపం. ఈ కాళ్ళా, ఈ చేతులా, ఈ తలకాయా రమణుడు అంటే? లేకపోతే ఈ శవమా? స్మశానానికి తీసుకెళ్ళి దహనం చేసేస్తారు కదా ఈ దేహాన్ని, ఈ దేహమా, ఈ శవమా రమణుడు అంటే? రమణుడు అంటే పరబ్రహ్మ స్వరూపం. రమణ సద్గురు అంటే ఆ పరబ్రహ్మ స్వరూపమే సద్గురువు. ఆ పరబ్రహ్మ గురించి మీరు స్తోత్రం చేస్తున్నారు నేనూ స్తోత్రం చేస్తున్నాను” అన్నారు భగవాన్.

భగవాన్ చెల్లెలు ఆయన ఇంకో నాలుగు రోజులలో చనిపోతారు అనగా బలవంతంగా క్షీరాన్నం పెట్టింది ఆయనకి. ఎందుకో ఆ దేహభావన వల్ల అన్నగారికి క్షీరాన్నం పెట్టాలని అనిపించింది ఆవిడకి. ఆయన వద్దన్నా సరే బలవంతాన కొంచెం క్షీరాన్నం పెట్టింది. లోపలికి వెళ్ళిన క్షీరాన్నం మళ్ళీ బయటికి వచ్చేసింది. క్షీరాన్నం బయటికి వచ్చేసింది ఇమడలేదు అని భగవాన్ చెల్లెలు అంటోంది. అప్పుడు రమణస్వామి అన్నారు, నువ్వు నాకు క్షీరాన్నం ఇమడలేదని బాధపడుతున్నావు, నేను చెప్పే మాటలు నీకు అర్థం అవ్వటం లేదని నేను బాధపడుతున్నాను అన్నారు. అరుణాచలంలో ఉండి జిన్నూరుని స్మరించటం కంటే, జిన్నూరులో ఉండి అరుణాచలాన్ని స్మరించటం మంచిది. దేహం ప్రధానం కానేకాదు మనస్సుతోటి సంబంధం పెట్టుకోవాలి. ఈశ్వరుడితోటి మనస్సుతో సంబంధం ఉండాలి. ఇది మనస్సుకి సంబంధించినది కానీ దేహానికి సంబంధించినది కానే కాదు. ఇప్పుడు మీరూ నేనూ దగ్గరగా కూర్చున్నాము. మీ మనస్సు ఈడూరులో ఉందనుకోండి, శరీరాలు దగ్గరగా ఉన్నా మన మనస్సులు ఎంతో దూరంగా ఉన్నాయి. దేహాలు దగ్గరగా ఉండటం కంటే మనస్సులు దగ్గరగా ఉండటం మంచిది. దేహాలు దూరమైనా ఫరవాలేదు, మనస్సులు దగ్గరగా ఉండాలి.

# (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ప్రతీ మనిషికి పుట్టుకతోటి ఒక స్వభావం వస్తుంది. అది గత జన్మల మీద ఆధారపడి ఉంటుంది. దానిని మార్చుకోవటం చాలా కష్టం. మీరు ఒక వంతెన కట్టించవచ్చు, పది అంతస్థుల మేడ కట్టించవచ్చు కానీ మీ స్వభావాన్ని మార్చుకోవటం కష్టం. ఆ స్వభావం యొక్క వేగం ముందు నీ నిగ్రహం ఏపాటిది అని భగవంతుడు అడుగుతున్నాడు. ఎవరో ఏదో చేసారని నువ్వు చెయ్యవద్దు. కొంతమంది తింగరతనంగా మాట్లాడతారు, అది వారి యొక్క స్వభావం. వాళ్ళు మాట్లాడుతున్నారని మీరు కూడా అలా మాట్లాడకూడదు. వాళ్ళు తింగరతనంగా మాట్లాడినా నార్మల్‌గా ఉండవచ్చు. మీరు తింగరతనంగా మాట్లాడి నార్మల్‌గా ఉండలేరు. ఎవరో ఏదో చేసారని మీరు అలా చెయ్యవద్దు. మీ స్వభావానికి అనుగుణంగా మీరు ఉండండి. మీ స్వభావానికి విరుద్ధంగా ప్రవర్తిస్తే మీకు అశాంతి వస్తుంది. పూర్వం మా ఊరిలో ఇద్దరు దివాళా తీసారు. అప్పుడు నాకు చిన్నతనం. ఊరిలో ఉన్న పెద్దమనుషులు ఎక్కడైతే న్యాయం ఉందో అక్కడికి కాకుండా, న్యాయంలేని వైపుకు వెళ్ళిపోయారు. అలా వెళ్ళిపోయారు ఏమిటి అని మా అమ్మను అడిగాను. అప్పుడు మా అమ్మ ఒకమాట చెప్పింది “లోకం అంటే అంతే. నీకు చిన్నతనం మూలంగా తెలియటం లేదు. ఏమిటి అందరూ అన్యాయం తరపుకు వెళ్ళిపోయారు, న్యాయం తరపున ఎవరూ కనపడటంలేదు ఏమిటి అంటున్నావు. లోకం అంటే అలాగే ఉంటుంది. నీకు చిన్న వయస్సు మూలంగా అలా అనిపిస్తోంది. దాని గురించి నువ్వు ఏమీ ఆశ్చర్యపడనక్కరలేదు” అని చెప్పింది.

రమణమహర్షి, రామకృష్ణపరమహంస వీళ్ళని జీవన్ముక్తులు అంటారు. ఒక మనిషి జీవన్ముక్తుడు అయితే ఇక్కడ ఉన్న ప్రజల్ని, వారి యొక్క యాక్టివిటీస్‌ని అంతా కూడా ఆత్మగానే చూస్తాడు, తన స్వరూపంగానే చూస్తాడు కానీ ఆయనకు భిన్నంగా ఏమీ కనబడదు. ఏదో జరిగిపోతోంది అని వాడికి ఏమీ అనిపించదు. మీరు సుఖం పొందాలంటే, శాంతిగా ఉండాలంటే జీవన్ముక్తులు అవ్వాలి. మనం కాలేజీలోను, హైస్కూల్‌లోను చదువుకొనే చదువులు అన్నీ కూడా కేవలం పొట్టకే పరిమితం. అసలు విద్య అంటే నీలో ఉన్న అవిద్యను పోగొట్టాలి, అదే నిజమైన విద్య. జ్ఞానం అంటే అది నీలో ఉన్న అజ్ఞానాన్ని పోగొట్టాలి. దేహం దాని ప్రారబ్ధాన్నిబట్టి వెళ్ళిపోతూ ఉంటుంది అని చెపుతున్నారు. ఇంక మేము కష్టపడి సాధన

చెయ్యటం ఎందుకు అని అడుగుతున్నారు. ప్రారబ్ధం యొక్క వేగం బలీయమైనది. సాధన వల్ల దాని యొక్క ప్రభావం మీమీద పడదు. దాని యొక్క ప్రభావం మీ మీద పడనప్పుడు ప్రారబ్ధం ఎలా ఉంటే ఏముంది? అది మంచి అయినా స్వప్నమే, చెడ్డ అయినా స్వప్నమే. నీ శరీరం మరణించినప్పుడు కూడా చావు యొక్క ప్రభావం నీ మీద ఏమీ ఉండదు. చావే కాదు దేహప్రారబ్ధం మీకు మంచిగా ఉన్నా, చెడ్డగా ఉన్నా ప్రారబ్ధం యొక్క ప్రభావం ఏమీ కూడా మీ మీద ఉండదు. ఇంక అంతకంటే మీకు ఏమి కావాలి.

భగవాన్ దగ్గరకు పాములు, చిరుతలు వచ్చేవి. మిమ్మల్ని పాము ఎప్పడూ కరవలేదా అని భగవాన్‌ను అడిగారు. నా శరీరానికి పాము చేత కరవబడే ప్రారబ్ధం ఉంటే అది ఆగదు అన్నారు భగవాన్. ఆయనను ఏ పాము కరవలేదు. దగ్గరకు వచ్చి తల ఎత్తి చూసేవి. భగవాన్ కూడా దాని వంక చూసేవారు. అలా కొంతసేపు చూసిన తరువాత వీడు మన విరోధి కాదు, మన మిత్రుడే అని దానికి అనిపించి తలదించేసి వెళ్ళిపోయేది. చిరుతపులి వచ్చినా భగవాన్ ఎప్పడూ ప్రక్కకు తప్పకోలేదు. భగవాన్ తప్పకోలేదని మనం తప్పకోకుండా ఉండకూడదు. ఎందుచేతనంటే మనకు శరీరభావన ఉంది కదా! దానికీ శరీరభావన వస్తుంది. అప్పడు మనకు భయం వేస్తుంది. అందుచేత తప్పకోవాలి. భగవాన్‌కు శరీరభావన లేదు. తన దేహం తానుకాదని తెలిసినప్పడు ఇతర దేహాలు అవి ఎలా అవుతాయి. పులి అంటే ఆ దేహాన్ని చూస్తే మనకు భయం వేస్తోంది కదా! నా దేహం నాది కానప్పడు పులి దేహం పులిది ఎలా అవుతుంది? అందుచేత అది ఏదో నాకు అపకారం చేస్తుంది అనే భావన నాకు రాదు. నేను ఏదో అపకారం చేస్తాను అనే భావన దానికి రాదు. ఏ జంతువు అయినా ఎందుకు కరుస్తుంది అంటే ఏదో మనకు అపకారం చేస్తారని భయంవేసి కంగారుపడి కరుస్తాయి.

మోక్షం అనే శబ్దానికి విడుదల అని అర్థం అంటే అజ్ఞానంలో నుండి విడుదల, అవిద్యలోనుండి విడుదల. బుద్ధుడు చెప్పిన నిర్వాణం అంటే ఆరిపోవటం. కిరసనాయిల్ అవ్వగానే మనం దీపాన్ని ఆర్పనక్కరలేదు, అదే ఆరిపోతుంది. అలాగే మీకు వాసనాక్షయం పూర్తి అయితే ఇంక మీకు శరీరం రాదు ఎందుచేతనంటే ఇంక మీకు శరీరం అవసరం లేదు. బుద్ధుడు వాసనాక్షయం గురించి ఎక్కువగా చెప్పాడు. ఏ వాసనను ఎలా తొలగించుకోవాలి అనేది ఎక్కువగా చెప్పాడు. మీరు చెప్పింది చేసినా ఫెయిల్ అవుతున్నాము

అని ఒకరు బుద్ధుడితో అంటే అప్పుడు రిమెంబర్ మి అని చెప్పాడు. పునర్జన్మ గురించి బుద్ధుడు బాగా చెప్పాడు. నీకు అవసరం ఉంటే వస్తుంది లేకపోతే రాదు అని చెప్పాడు. నీకు ఆకలి వేస్తే అన్నం తింటావు, ఆకలి లేకపోతే తినవు. నీకు దాహం వేస్తే నీళ్ళు తాగుతావు, దాహం లేకపోతే తాగవు. అలాగే నీకు శరీరం అవసరం ఉందా? నీలో వాసన ఉంటే నీకు శరీరం అవసరం. వాసన లేనప్పుడు నీకు శరీరంతో పనిలేదు. అందుచేత వాసనాక్షయం అయితే ఇంక నీకు శరీరం రాదు అది బుద్ధుడు చెప్పిన సైన్స్. మీరు ఏదో చెపుతున్నారు అది మాకు అందటంలేదు అని ఒకసారి భగవాన్‌ని అడిగారు. అలవాట్ల వేగం అలా ఉన్నప్పుడు మనం ఏమి చేసేది. అలవాట్ల వేగం అలా ఉన్నప్పుడు నేను చెప్పిన మాటను నీ మనస్సు అంగీకరించదు అని చెప్పారు.

గురువుకి శరీరం ఉన్నా లేకపోయినా పని చేస్తూనే ఉంటాడు. గురూ ఈజ్ వర్కింగ్, గాడ్ ఈజ్ ఆల్‌సో వర్కింగ్. మన శరీరం ఏదో రోజున చనిపోతుంది అలాగని భగవంతుడు పనిచేయటం మానడు. భగవంతుడి యొక్క పని అలా జరుగుతూనే ఉంటుంది. ఈ సృష్టి అంతా కూడా ఆయన వర్కే కదా! భగవంతుడికి అవయవాలు అక్కరలేదు. ఆయన కళ్ళు లేకుండా చూడగలడు, చెవులు లేకుండా వినగలడు, శరీరం లేకుండా పనిచేయగలడు. ఈ విషయం కనుక మీరు మర్చిపోతే మంత్రంలాగ జ్ఞాపకం ఉంచుకోండి. భగవంతుడు నాన్‌స్టాప్‌గా పనిచేస్తూ ఉంటాడు. ఆయనకు శరీరం అవసరం లేదు. ఒకవేళ శరీరం అవసరం అనుకొంటే తీసుకొంటాడు. వారిని కారణజన్ములు అంటారు. ఏదో ఒక కారణం కోసం వారికి దేహాలు వస్తాయి. అంటే వారు కర్మఫలాన్ని ఏమీ అనుభవించనక్కరలేదు. ఎందుచేతనంటే చేసిన వెంటనే అది కాలిపోతుంది. కర్తృత్వం లేకుండా కర్మ చేస్తే అది వెంటనే కాలిపోతుంది, ఆ కర్మ వాడిని చుట్టుకోదు. మనిషి యొక్క దుఃఖానికి కారణం కర్తృత్వం. మనం కర్మ చేస్తున్నాము కాని కర్త లేని కర్మ చేయటం మనం నేర్చుకోవాలి. గురువు కూడా పని చేస్తూ ఉంటాడు. మీరు పని మానివేసినంతమాత్రం చేత గురువు కూడా పని మానివేసాడు అని అనుకోవద్దు. మీ శరీరం మరణించినా ఆయన పని అలా కంటిన్యూ అవుతూ ఉంటుంది. అది మీరు ఎవ్వరూ మరచిపోకండి.

బుద్ధుడికి జ్ఞానం కలిగిందా అని ఒకరు భగవాన్‌ని అడిగారు. మీకు ఇటువంటి సందేహాలు ఎందుకు వస్తున్నాయి. ఈ భూమి నిర్మాణం అయ్యాక బుద్ధుడులాంటి వ్యక్తి

ఎవడూ ఈ భూమి మీదకు రాలేదు. మర్యాద పూర్తిగా తెలిసిన మనిషి. దేవతలు, మతాలు, మోక్షం ఈ గొడవ వదిలేయండి. బుద్ధుడిలో ఏ బలహీనతలు లేవు. రియాక్షన్ అనేది బుద్ధుడిలో ఎక్కడా కనబడదు. బుద్ధుడు కొద్దిసేపు మాట్లాడితే మొదటి వాక్యం ఎలా ఉంటుందో చివరి వాక్యం కూడా అలా మాట్లాడతాడు. బుద్ధుడిని నువ్వు ఉద్రేక పరిచినా ఆయన ఉద్రేకపడడు. నువ్వు నాకు ఒక జామకాయ ఇచ్చావు అనుకో, దానిని నేను తీసుకోలేదు అనుకో, అది తిరిగి నీకే వస్తుంది. అలాగే నీ మాటలు నేను లోపలకు తీసుకోవటం లేదు కాబట్టి ఆ మాటలు అన్నీ నీకే వర్తిస్తాయి. నీ మాటలు నేను తీసుకొంటే నాకు ఉద్రేకం రావచ్చు, తీసుకోవటం లేదు కాబట్టి కూల్‌గానే ఉన్నాను. నూటికి నూరు పాళ్ళు నాగరికత తెలిసినవాడు బుద్ధుడు. అవసరంలేని మాట ఒక్కటి కూడా మాట్లాడడు. అవసరం ఉన్న మాట విడిచిపెట్టడు. బుద్ధుడి టీచింగ్‌లో ఎక్కడా ఎమోషన్ కనబడదు. అక్కడ సబ్జెక్టే ప్రధానం మిగతా గొడవలు ఏమీ ఉండవు. మహిమలు చేసేవాళ్ళను ఇటువంటివాళ్ళను ఆయన కూడా రానివ్వడు. బుద్ధగయలో ఆయనకు జ్ఞానోదయం అయ్యాక ఎదురుగా ఉన్న చెట్టు వంక నిలబడి 24 గంటలు రెప్పవాల్చకుండా చూసాడు. ఇప్పుడు టీచింగ్‌కు బయలుదేరటమా, వద్దా? మన దగ్గరకు వచ్చినవారికే చెప్పటమా లేకపోతే దేశం అంతా తిరిగి టీచ్ చెయ్యటమా అని అలా 24 గంటలు ఆ చెట్టువంక చూస్తూ నిలబడి ఉన్నాడు. అప్పుడు ఆయన కాంక్షస్‌నెస్ చెప్పింది. టీచింగ్ చెయ్యాలి అని నిర్ణయించుకొన్నాక, ఫస్ట్ టీచింగ్ ఎక్కడ చెయ్యాలి అని? ఒకప్పుడు మనతోటి స్నేహంగా ఉండి తరువాత మనల్ని అపార్థం చేసుకొని వెళ్ళిపోయారు కదా వారికే ఫస్ట్ టీచింగ్ చేద్దాము అనుకొని, వారు ఎక్కడ ఉన్నారు అని ఆయన దివ్యదృష్టితో చూసారు. వారు సారనాథ్‌లో ఉన్నారని బుద్ధగయనుండి సారనాథ్ నడిచి వెళ్ళాడు. బుద్ధుడు సారనాథ్‌లో ఫస్ట్ టీచింగ్ మొదలుపెట్టాడు. హిందూమతంలో ఉన్న అనాచారాలను బుద్ధుడు ఖండించాడు. ఈ ఆచారాలకంటే వాసనాక్షయానికి బుద్ధుడు ఎక్కువ ప్రాముఖ్యత ఇచ్చాడు. నీకు ఏ వాసన ఉంది దానిని ఎలా క్షీణింపచేసుకోవాలి అనేది చెప్పాడు. నీకు అర్థమయ్యేలాగ చెపుతాడు. ముగింపు లేకుండా నీకు అవగాహనకు వచ్చే వరకు చెపుతాడు. ఆయన దయా స్వరూపుడు. మానవుడిని దుఃఖస్పర్శలేని స్థితికి తీసుకొనిపోవాలి అదే ఆయన గమ్యం. ఏ కారణం వల్ల కూడా నీకు దుఃఖం రాకూడదు. ఆ స్థితికి తీసుకొనిపోవటానికి 45 సంవత్సరాలు బోధించాడు.

## జిన్నూరు శ్రీ రమణ క్షేత్రం

| | | |
|---|---|---|
| మార్చి | 18 | మధ్యాహ్నం గం॥ 1-00లకు రామచంద్రరాజుగారి ప్రవచనము |
| మార్చి | 25 | మధ్యాహ్నం గం॥ 1-00లకు నాగలక్ష్మి గారి ప్రవచనము |
| ఏప్రియల్ | 20 | మధ్యాహ్నం గం॥ 1-00లకు వైజాగ్ సుజాత గారి ప్రవచనము |
| ఏప్రియల్ | 29 | మధ్యాహ్నం గం॥ 1-00లకు డాక్టర్ ఉష గారి ప్రవచనము |

## ఉగాది

మరొక నూతన తెలుగు సంవత్సరం 'విళంబి'లోకి ప్రవేశించబోతున్నాం. నూతన సంవత్సరం అనగానే కాలగమనం గురించి మరొకసారి గుర్తుచేసుకోవలసిన రోజు. సృష్టిలో వెలకట్టలేని వస్తువు కాలము. ఈ వర్తమానకాలాన్ని ఉపయోగించుకొని, కాలాతీత సత్యంలోకి మేలుకోవాలి. కాలానికి లోబడియున్న శరీరము, మనస్సు, బుద్ధిని, ఉపయోగించుకొని కాలాతీత ఉనికిని 'తాను'గా అనుభవైకవేద్యం చేసుకోవాలి. శరీరం పుట్టింది అంటే, ఏ క్షణానికి ఆ క్షణం, మృత్యువుకు దగ్గర అవుతోందని అర్థం. "నీవు ఈ భూమి మీదకు వచ్చిన పని మర్చిపోవద్దు" అంటారు భగవాన్ శ్రీరమణమహర్షి. అనగా మానవశరీరం ధరించి ఈ భూమి మీదకు ఏ పని నిమిత్తం వచ్చామో, ఆ పనిని మరిచిపోకూడదు. పరమాత్మ మనకు బహూకరించిన ఈ మానవజన్మ కాలరూపంలో ఉంది కాబట్టి, అట్లే పరమాత్మ కాలరూపంలో ఉన్నాడు కాబట్టి, కాలాన్ని సద్వినియోగం చేసుకోవడమే మనము దేవునికి చేసే పూజ మరియు అలంకరణ. జీవునికి మానవ శరీరము లభించుట అపూర్వవరము. మనము అహంకారంతో కాకుండా, దైవంతో సన్నిహితంగా ఉండాలి. అది అస్వస్థత నుండి స్వస్థత చేకూరడం లాంటిది. మన నిత్య జీవితంలో ఆధ్యాత్మిక విలువలు సంతరించుకున్నప్పుడే మానవాళికి కల్యాణము, సుఖశాంతులు ఏర్పడతాయి. మహాత్ముల బోధను మన దైనందిన జీవితంలో అన్వయించుకోవాలి. సర్వకర్మలను పరమాత్మకే అర్పించి, అహంకారాన్ని, మమకారాన్ని, ఆశను విడిచిపెట్టాలి. ప్రతిమనిషి, ప్రతిక్షణం, తాను ఎవరో? తన నిజస్వరూపం ఏమిటో? తెలుసుకునేందుకే కాలాన్ని ఉపయోగించుకోవాలి, అంతకు మించి మహత్కార్యం లేదు. ఒక పువ్వు తేనెను, సువాసనను, పంచిపెట్టి తన పని పూర్తి కాగానే నిశ్శబ్ధంగా రాలిపోతుంది. అదేవిధంగా ఒక కాలంలో ఈ భూమి మీదకు వచ్చిన శరీరాన్ని ఉపయోగించుకొని వాస్తవంగా తాను ఎవరో? అనుభవైకవేద్యం చేసుకొనుటయే ఈ జీవిత పరమావధి. కాబట్టి దుర్లభమైన మానవజన్మను మహోన్నతం చేసుకోవాలి.

**(ది॥ 18-03-2018 ఉగాది పండుగ సందర్భంగా)**

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

# ఉల్లంఘించబడని ప్రకృతి సూత్రమే - విధి

'విధి' నియమాలను గ్రహించి తదనుగుణంగా శాంతంగా జీవించటమే మన ధర్మం. నిత్య జీవితంలో మనస్సే అన్ని సమస్యలకూ మూలకారణం. అది కల్మష పూరితమైనప్పడు మనకు మనమే కీడు చేసుకోవటమే కాకుండా, మన పరిసరాలను ఉద్రేకమౌతాయి. మన దుఃఖం అందరికీ పంచిపెడతాము. ఇది మరుసటి జన్మలో మనలను వెంటాడుతుంది. నవ్వుతూ చేసే హింసాకార్యం ఏడుస్తూ అనుభవించే రోజు కోసం ఎదురు చూస్తుంది. ధర్మజీవిత కళను అభ్యసించాలి. మనస్సు ప్రేమ కరుణతో నిర్మలంగా ఉంచుకొన్నప్పడు శాంతిసుఖాలు అనుభవిస్తాము. స్వామి వివేకానంద "విధి ఆగ్రహించి వందరకాల విషమ పరీక్షలతో హింసించినా, ప్రకృతి కోపగించినా మన ఆత్మ గొప్పతనాన్ని తెలుసుకో దారిలో ఆగకూడదు. అటూ ఇటూ చూడక దారి తప్పకుండా గమ్యం మీదనే దృష్టి పెట్టుకొని ముందుకు సాగిపో" అన్నారు. అన్ని పాపాలు విధి అనే యాంత్రికం నుంచే వస్తాయి. మన జీవితాన్ని నరకమయం చేస్తుంది. 'నరకం' అంటే వర్తమానంలో లేకపోవటమే. 'స్వర్గం' అంటే 'ఊరికే ఉండటమే'. మన మానసిక స్థితి మొత్తం మారవలసి ఉంటుంది. గతం, భవిష్యత్తులో ఉంటే మనస్సు అనే చీకటి గదిలో ఉన్నట్లే. మన జీవితాన్ని ఒక సమస్యగా ఉంది అంటే నా జీవితమే నరకం అని అనుకోకుండా భగవంతుడు ఈ దుఃఖాన్ని ఒకబహుమతిగా, దీవెనగా, ఆశీర్వాదంగా ఇచ్చాడు అని భావించాలి. బుద్ధుడు ఎప్పడూ భావోద్రేకానికి లోనుకాలేదు. మోహం మీద ప్రదర్శించలేదు. అతని కళ్లలో నీళ్ళు చూడలేదు, పెదాలపై చిరునవ్వు చూడలేదు. ఆయన బ్రతికి ఉండగా ఒక చలువరాతి శిల్పంగా ఉన్నాడు. ఆ స్ఫూర్తిని నిత్యం మనం మననం చేసుకోవాలి. కొందరు క్లేశంతో ఇది నా విధి - నా విధి - నా విధి అని తలను తలుపుకు పెట్టి కొట్టుకొంటుంటారు. విధికి మనం ఎందులకు బాధ్యులమైనట్లు భావించుకోవాలి. ఆకులన్నీ రాలిన చెట్టునుంచే కొత్త చిగురు వస్తుంది. అపజయాల్లో కూడా గెలుపు వెంటనే చూడవచ్చును. మన పనిని ధర్మదృష్టితో, పవిత్ర దృష్టితో నిర్వహించాలి. మన కర్మలను శాంతంగా అనుభవిస్తూ జీవితాన్ని పునీతం చేసుకోవాలి. మోహం (రాగం) అనవసరమైన వాంఛలు మన నెత్తిన వచ్చి కూర్చున్నట్లు తలబాదుకోకూడదు. మనం నిలువెల్ల ఆత్మ స్వరూపమే అనే ఎరుక ఉంటే బంధాలు, బాధ్యతలు అన్నీ తెగిపోతాయి. శ్రీనాన్నగారు "గదిలో నాలుగు గోడల మధ్య ఉండి ధ్యానం చేస్తే సరిపోదు నలుగురిలో ఉండి ఒక్కొక్కప్పడు మొట్టికాయలు తగిలేటప్పడు వివేకం పెరుగుతుంది. సూక్ష్మబుద్ధి వల్ల నిజ గమ్యాన్ని చేరగలవు. మనో పరిధిని దాటాలి అంతర్ముఖం చేసుకోవాలి. ఇది కావాలి అని దైవాన్ని ఎప్పడూ అడగకూడదు" అన్నారు. ఎరుకలేకుండా బ్రతికితే మన బ్రతుకు ఎదురుగాలికి ఎగిరిన దుమ్ములా ఉంటుంది. ఆకాశంవైపు ఉమ్ము వేస్తే మన కళ్లలోనే పడుతుంది. మూఢుడు జ్ఞానికి తలపెట్టిన కష్టం అలానే ఉంటుంది. సృష్టి అతనిపై పగతీర్చుకొంటుంది. హానికారకుడు అమిత దుఃఖాన్ని అనుభవిస్తాడు. అమాయకునకుహాని చెయ్యటం మనస్సుకు చాలా ఇష్టం ఆతను సులువుగా నలిగిపోతాడు. గురు అనుగ్రహంలో ఉన్న కోమలంగా ఉండేవానికి హానిచేస్తే అది పదింతలై కుళ్ళిపోతాడు. 'ఊరక ఉంటే' విధి చేతులు ఎత్తివేస్తుంది. తలదించుతుంది విధిపై ఇదే పోరాట పటిమను వజ్రతుల్యం చేసుకోవాలి.

- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966